క్లుప్తంగా

రామాలయ నిర్మాణానికి టీటీడీ చెక్కు అందజేత



కైకలూరు: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) శ్రీవాణి ట్రస్ట్ నుంచి రూ.3.27 లక్షల చెక్కు ముదినేపల్లి మండలం పెనుమిల్లి పంచాయతీ సింగారం దళితవాడ కోదండ రామాలయ నిర్మాణ నిమిత్తం గురువారం వచ్చింది. దీంతో నిర్వాహకులు ఈ చెక్కును కైకలూరులో ఎమ్మెల్యే డీఎన్నార్ చేతుల మీదుగా అందుకున్నారు. నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని ఎమ్మెల్యే సూచించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ముత్యాల రాంబాబు, నాయకులు గూడపాటి శ్రీరామ మూర్తి, ముత్యాల వెంకటేశ్వరరావు, బిక్షాలు, ఎం.వెంకయ్య, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

డ్రాప్ అవుట్స్ కోసం స్పెషల్ డ్రైవ్

కురుమద్దాలి(పామర్రు): మండల పరిధిలో పదవ తరగతి, ఇంటర్మీడియెట్ ఫెయిల్ అయ్యి సప్లిమెంటరీ ఫీజు కట్టకుండా ఉన్న వారిని గుర్తించేందుకు స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్నామని పామర్రు ఎంఈవో–2 పద్మవాణి తెలిపారు. మండల పరిధి కురుమద్దాలి గ్రామంలో గురువారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 100 శాతం గ్రాస్ ఎన్‌రోల్‌మెంట్ రిజిస్ట్రేషన్(జీఈఆర్)లో భాగంగా ఈ స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో డ్రాప్ అవుట్స్ విద్యార్థులను గుర్తించి వారు స్థానిక సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కురుమద్దాలి గ్రామంలోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో ఒక విద్యార్థిని గుర్తించి అవగాహన కల్పించారు. సచివాలయ ఉద్యోగి అశోక్ పాల్గొన్నారు.

ప్రకృతి కూరగాయలకు ఆదరణ

ముదినేపల్లిరూరల్: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలకు ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోంది. ముదినేపల్లి మండలంలో ఈ తరహా సేద్యాన్ని రెండు గ్రామాల్లో చేపట్టగా పండించిన కూరగాయలను స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద దుకాణం ఏర్పాటు చేసి విక్రయిస్తున్నారు. ముదినేపల్లిలో ప్రతి సోమవారం వారపు సంత జరుగుతుంది. ఈ సంతకు వచ్చే వారు ఈ కూరగాయలపై ఎక్కువగా మక్కువ చూపుతున్నారు. అదేవిధంగా ఇతర రోజుల్లోనూ ఎంపీడీవో కార్యాలయం వద్ద వీటిని ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు ఈ కూరగాయలను విరివిగా కొనుగోలు చేస్తున్నారని ప్రకృతి వ్యవసాయ నియోజకవర్గ డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగానే గురువారం దుకాణం ఏర్పాటు చేయగా కొద్ది వ్యవధిలోనే కూరగాయలన్నీ అమ్ముడుపోయాయి.

మధ్యాహ్న భోజన పథకం పరిశీలన



కలిదిండి: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకం అమలులో వచ్చిన ఆరోపణలపై ఏలూరు జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్‌సుందర్, కలిదిండి ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు గురువారం స్కూల్‌లో భోజనాన్ని పరిశీలించారు. భోజనంలో నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడం, గుడ్లు సరిగా పంపిణీ చేయకపోవడం వంటి విషయాలను గత నెల 31న ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు ఇక్కడ మధ్యాహ్న భోజన పథకం తీరును తన పరిశీలనలో గుర్తించారు. దీనిపై కలిదిండి ఎంఈవో నివేదిక జిల్లా అధికారులకు అందించారు. ఫిర్యాదుపై విచారణకు వచ్చిన డీఈవో మధ్యాహ్న భోజన పథకం పరిశీలించిన తర్వాత ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. హెచ్‌ఎంకు త్వరలో షోకాజ్ నోటీసు అందిస్తామన్నారు. చాలా మంది విద్యార్థులు బడిబయట ఉన్నారని, వారందరని బడిలో చేర్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, సర్పంచ్ మసిముక్కు మారుతీప్రసన్న, వైస్ ఎంపీపీ నాగలక్ష్మి, ఎంఈవోలు నరేష్‌కుమార్, ప్రభాకరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీటి వృథాను అరికట్టాలి



వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ జగనన్న కాలనీలో ఉన్న పబ్లిక్ కుళాయిల నుంచి తాగునీరు వృథాగా పోతుంది. కాలనీలో ఏర్పాటు చేసిన కుళాయి సరిగా లేకపోవటంతో తాగునీరు వృథాగా పోతుంది. రోడ్డుపై నీరు నిల్వ ఉండడంతో ఇంటి నిర్మాణ పనుల కోసం మెటీరియల్ తీసుకుని రావటానికి ఇబ్బందిగా మారిందని లబ్ధిదారులు తెలిపారు. అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

ఆర్థిక సాయం అందజేత

బంటుమిల్లి: సెయింట్‌జాన్స్ ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో టీచర్‌గా పని చేస్తూ ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన నందిగామ తిరుమల మాస్టారుకు పెడన సహాయ ఫౌండేషన్ ప్రతినిధులు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం ఫౌండేషన్ ప్రతినిధులు పాఠశాల డైరెక్టర్ సాబూజాన్ ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులకు రూ.18 వేల చెక్‌ను అందజేశారు. ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా, వ్యాపారవేత్త గాజుల సాంబయ్యానాయుడు, మస్తాన్ బేగ్, బలరాం, నాగబాబు పాల్గొన్నారు.

నాడు - నేడుతో పాఠశాలలకు మహర్దశ

- విద్యా సాధికారతకు మార్గం సుగమం
- మండలంలో రెండో విడతలో 25 పాఠశాలల అభివృద్ధి
- రూ.629.33 లక్షలు మంజూరు



నాడు-నేడు పథకం కింద అభివృద్ధి చేస్తున్న అగినపర్రు పాఠశాల



బొడ్డువానిగూడెం పాఠశాలలో విద్యార్థులు

పమిడిముక్కల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాడు – నేడు పథకంతో ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ పట్టింది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు ధీటుగా తీర్చిదిద్దుతున్నారు. పేద పిల్లలు ప్రపంచంతో పోటీ పడేలా ఇంగ్లిష్ మీడియం బోధనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారు. అమ్మ ఒడి, గోరుముద్ద, విద్యా దీవెన, వసతి దీవెన వంటి పథకాల ద్వారా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు విద్యా సాధికారత సాధించడానికి మార్గం సుగమం చేశారు.

ఏ పాఠశాలకు ఎంత నిధులు..

మండలంలో రెండో విడతలో 25 పాఠశాలలకు రూ.629.33 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో హైస్కూళ్లలో అదనపు తరగతి గదులు, అంగన్‌వాడీ కేంద్రాలకు మరమ్మతులు, టెన్ కాంపోనెంట్ కింద మేజర్, మైనర్ రిపేర్లు, టాయిలెట్లు, కిచెన్ షెడ్లు, ఎలక్ట్రికల్ వర్క్‌లు, ఫ్యాన్లు, లైట్లు, డెస్కులు ఏర్పాటు చేస్తున్నారు. కపిలేశ్వరపురం హైస్కూల్‌కు రూ.69 లక్షలు, మేడూరు హైస్కూల్‌కు రూ.51 లక్షలు, ఐనపూరు హైస్కూల్‌కు రూ.63 లక్షలు, తాడంకి హైస్కూల్‌కు రూ.48 లక్షలు, మర్రివాడ ప్రాథమికోన్నత పాఠశాలకు రూ.24 లక్షలు, కపిలేశ్వరపురం మెయిన్ ప్రాథమిక పాఠశాలకు రూ.రూ.24 లక్షలు మంజూరయ్యాయి. మంటాడ మెయిన్ ప్రాథమిక పాఠశాలకు రూ.5 లక్షలు, పమిడిముక్కల మెయిన్ ప్రాథమిక పాఠశాలలకు రూ.5 లక్షలు, బొడ్డువానిగూడెం పాఠశాలలకు రూ.5 లక్షలు, కృష్ణాపురం పాఠశాలకు రూ.5 లక్షలు, మంటాడ బీసీ పాఠశాలకు రూ.16 లక్షలు, మంటాడ పాఠశాలకు రూ.20 లక్షలు, కపిలేశ్వరపురం ముత్రాసిపాలెం పాఠశాలకు రూ.16 లక్షలు, కపిలేశ్వరపురం ఈస్ట్ పాఠశాలకు రూ.16 లక్షలు, కపిలేశ్వరపురం ఉర్దూ పాఠశాలకు రూ.12 లక్షలు, హనుమంతపురం హైస్కూల్‌కు రూ.68 లక్షలు, వీరంకిలాకు ప్రాథమిక పాఠశాలకు రూ.12 లక్షలు, మేడూరు ముత్రాసిపాలెం పాఠశాలకు రూ.12 లక్షలు, పమిడిముక్కల హైస్కూల్‌కు రూ.20 లక్షలు, ముసలనాయికపాలెం పాఠశాలకు రూ.12 లక్షలు, చోరగుడి హైస్కూల్‌కు రూ.78 లక్షలు, అగినపర్రు పాఠవాలకు రూ.10.50 లక్షలు, ఐనంపూడి పాఠశాలకు రూ.12 లక్షలు, పైడికొండలపాలెం పాఠశాలకు రూ.11.90 లక్షలు మంజూరయ్యాయి.

శరవేగంగా పనులు..



నాడు – నేడు పథకం కింద మండలంలోని 25 పాఠశాలల్లో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయి. ఇంజినీరింగ్ అసిస్టెంట్ల సహకారంతో ప్రతి రోజూ అభివృద్ధి పనులను పర్యవేక్షిస్తున్నాం. నాణ్యతా ప్రమాణాలతో పనులు చేయిస్తున్నాం. గతంలో ఎన్నడూ పాఠశాలలకు ఈ విధంగా నిధులు మంజూరు రాలేదు. విద్యార్థులకు అన్ని వసతులు అందుబాటులోకి రానున్నాయి.

– శరాబందిరాజు, ఏఈ, పీఆర్

విద్యకు పెద్దపీట..



ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దుతున్నారు. పేద పిల్లల బంగారు భవిష్యత్‌కు ప్రభుత్వం బాటలు వేస్తోంది. నాడు–నేడు పథకంతో పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. పాఠశాలలకు అవసరమైన వసతులన్నీ సమకూరుతున్నాయి. విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమని భావించి ప్రభుత్వం విద్యకు ప్రాధాన్యత ఇస్తోంది.

– శ్రీనివాస్, ఎంఈఓ

ఆక్రమణలు తొలగించాలని నోటీసుల జారీ



కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలంలో కూచిపూడి ప్రధాన కూడలిలో గల పసుమర్తి వారి ధర్మచెరువు ఆక్రమణకు గురై వ్యాపారాలు, నివాసాలు కొనసాగుతున్న నేపథ్యంలో కోర్టు ఉత్తర్వుల మేరకు ఆక్రమణలు తొలగించాలంటూ గ్రామ పంచాయతీ నోటీసులు జారీ చేసింది. ఆంధ్రప్రదేశ్ అత్యున్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు కూచిపూడిలోని చెరువు ఆక్రమణదారులు వారం రోజుల్లో ఆధారాలతో గ్రామ పంచాయతీకి సమర్పించాలని అలా కాని పక్షంలో వారం అనంతరం హైకోర్టు ఆదేశాలను అనుసరిస్తామని గ్రేడ్–1 కార్యదర్శి ఇస్లావత్ భవాని తెలిపారు. ఈ మేరకు ఆక్రమణదారులకు నోటీసులు అందించినట్లు వెల్లడించారు. రహదారులు, డ్రెయినేజీ, కాలువలు, చెరువు కట్టలు, నీటి గుంటలు, బందుల దొడ్లు, రిజర్వాయర్లు, పంచాయతీ స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేయటంతో జిల్లా ఉన్నతాధికారుల నుంచి తహసీల్దార్, ఎంపీడీవో, గ్రామ పంచాయతీలకు ఆదేశాలు అందాయి. కాగా మండలంలోని 21 గ్రామాల్లో ఆక్రమణలు తొలగించటానికి చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అధికారులు గ్రామ పంచాయతీ అధికారులకు ఆదేశించినట్లు తెలుస్తోంది.

అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్



ప్రభుత్వ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

మొవ్వపాలెం(మొవ్వ): అవినీతికి తావులేకుండా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తూ విశ్వసనీయతకు మారుగా నిలిచిన ఏకైక పార్టీ వైఎస్సార్ సీపీ అని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మండలంలోని మొవ్వపాలెం గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లతో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. అలాగే ఆయా కుటుంబాలకు ఏ మేరకు లబ్ధి చేకూరిందో తెలియజేశారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యకు తక్షణ పరిష్కార దిశగా అధికారులకు సూచనలిస్తూ ముందుకు సాగారు. సంక్షేమం, అభ్యున్నతికై కృషి ఈ సందర్భంగా ఎమ్మెల్యే కైలే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలోని ప్రతి కుటుంబాన్ని తన సొంత కుటుంబంగా భావిస్తూ అందరి సంక్షేమం, అభ్యున్నతికై కృషి చేస్తున్నారన్నారు. ప్రజలు అంతర్గత రహదారులు, డ్రెయిన్ సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చలమలశెట్టి శివకుమారి, ఎంపీటీసీ, మండల సచివాలయ కన్వీనర్ సమ్మెట ఆంజనేయులు, పార్టీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు, తహసీల్దార్ సీహెచ్ వీరాంజనేయ ప్రసాద్, ఎంపీడీవో జి.సుధాప్రవీణ్, సర్పంచ్‌లు వేములమడ సీతారామయ్య, తూము పూర్ణచంద్రావు, కె.అన్నామణి, నాయకులు చలమలశెట్టి వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు సీహెచ్ బ్రహ్మయ్య, పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు మురారి శ్రీనివాసరావు(బాబు), నాయకులు మురారి శ్రీనివాసరావు, చప్పిడి రాధాకృష్ణ, గార్లపాటి వెంకట్, వివిధ శాఖల అధికారులు, పంచాయతీ పాలక మండలి సభ్యులు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు భట్లపెనుమర్రులో..

మొవ్వ మండలం భట్లపెనుమర్రులో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పాల్గొంటారని పార్టీ మండల అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు తెలిపారు. అందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శరవేగంగా డ్రెయిన్ల నిర్మాణం



ముదినేపల్లిరూరల్: మండలంలోని గురజ పంచాయతీ పరిధిలో పక్కా డ్రెయిన్ నిర్మాణాలు మూడు రోజులుగా శరవేగంగా జరుగుతున్నాయి. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పంచాయతీ పరిధిలో స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) మంజూరు చేసిన నిధులతో డ్రెయిన్ల నిర్మాణాన్ని చేపట్టారు. ఈ నిర్మాణ పనులను ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామంలో ఎన్నో సంవత్సరాలుగా డ్రెయినేజీ సమస్యలతో ప్రజలు అవస్థలు పడుతున్నారని, గత ప్రభుత్వంలో నిధులు కేటాయించకపోవడంతో వర్షాకాలంలో గ్రామం మురికికూపంగా మారేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంతో సమస్య పరిష్కరించామని తెలిపారు. పార్టీ నాయకులు మోట్రు ఏసుబాబు, బొర్రా శేషుబాబు, మరీదు వసంతరావు, రాచూరి కుమార్, దివి సతీష్, పేర్ని పృథ్వీ, చిట్టిబొమ్మ రవికుమార్, రమేష్ ఉన్నారు.

ఆలయానికి పంచలోహ విగ్రహం బహూకరణ



ఆలయంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

పామర్రు: స్థానిక రుక్మిణి సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పరిధిలోని రాజ్యలక్ష్మీ అమ్మవారి ఉప ఆలయానికి దాతలు పంచలోహ రాజ్యలక్ష్మీ దేవి విగ్రహాన్ని గురువారం బహూకరించారు. స్థానిక భక్తులు బొమ్మారెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, సులేఖ దంపతుల సౌజన్యంతో విగ్రహాన్ని ఆలయానికి అందజేశారు. ఆలయంలో నూతన విగ్రహానికి విశేషంగా అభిషేకాలు, స్నపనలు పూజలు చేశారు. తొలుత విశ్వక్షేణారాధన, మండపారాధన కలశ స్థాపన నిర్వహించారు. అనంతరం అమ్మవారిని ఆవు పాలు, పెరుగు, నెయ్యి, తేనె, పంచాదారలతో పాటు నవ రసాలతో విశేషంగా అభిషేకాలను చేశారు. తదుపరి ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించి పూర్ణాహుతి చేశారు. అమ్మవారిని అంగరంగ వైభవంగా మేళ తాళాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేసి అనంతరం అమ్మవారిని ఆలయ ప్రవేశం చేయించారు. విశేషంగా శత సహస్త నామాలతో పూజలు చేసి, నిరాజన మంత్ర పుష్పాలను ఇచ్చారు. ఆలయంలో పూజాధికాలను తమిరిశ వేద ప్రకాష్, కార్తీక్‌ల ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ, అన్న ప్రసాదాలను అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ మేనేజర్ కందుల వెంకటరెడ్డి, ఆలయ అర్చకులు నరసింహ ప్రసాద్, ఆలయ సిబ్బంది కె.ప్రభాకర్‌రెడ్డి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

తిరు నక్షత్ర వేడుకల్లో పాల్గొనండి



జీయర్ స్వామి వారికి స్వాగతం పలుకుతున్న ఆలయ ఈఓ షణ్ముగం, అర్చకులు

గుడివాడటౌన్: త్రిదండి రామానుజ చినజీయర్ స్వామి తిరు నక్షత్ర పర్వదిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని అహోబిల రామానుజ జీయర్ స్వామి కోరారు. స్థానిక జగన్నాథపురం పాటిమీద వేం చేసి ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో గురువారం జీయర్ స్వామి భక్తులతో మాట్లాడారు. తొలుత ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం, ఆలయ అర్చకులు వేదాంతం అప్పలాచార్యులు జీయర్ స్వామి వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం స్వామి వారు మాట్లాడుతూ.. ఈ నెల 6 నుంచి 12వ తేదీ వరకు కృష్ణానది తీరాన కొలువై ఉన్న సీతానగరం విజయకీలాద్రిలో చినజీయర్ స్వామి వారి ఆధ్వర్యంలో జరిగే తిరునక్షత్ర పర్వదిన వేడుకల్లో భక్తులు భాగస్వాములు కావాలన్నారు. వేడుకల్లో భాగంగా లోక కల్యాణార్థం, హోమాలు, వేదగురు సత్కార కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం ఉమామహేశ్వరరావు



విద్యార్థి భానుప్రసాద్‌తో హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీడీ బాలస్వామి

గుడివాడటౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ రాష్ట్ర స్థాయి పోటీలకు స్థానిక ఏకేటీపీ మున్సిపల్ బాలికోన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.ఉమామహేశ్వరరావు గురువారం క్రీడాకారులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ పాఠశాలకు చెందిన ఎ.దేవి అండర్–17 ఖో–ఖో పోటీల్లో, ఎం.శశిశ్రీ అండర్–14 బాస్కెట్ బాల్ పోటీలకు, ఎల్.లక్ష్మీ ధనుశ్రీ అండర్–14 కరాటే పోటీలకు ఎంపికైనట్లు ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇంతటి ప్రతిభను కనపర్చిన విద్యార్థులను, వారికి తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయురాలు కె.అనూరాధను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

భానుప్రసాద్ ఎంపిక

తోట్లవల్లూరు: కృష్ణాజిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన గుడివాడలో జరిగిన అండర్ 14, 17 సంవత్సరాలలోపు బాల, బాలికల అథ్లెటిక్స్ సెలక్షన్స్‌లో పెనమకూరు జెడ్పీ పాఠశాల 8వ తరగతి విద్యార్థి స మ్మంగి భానుప్రసాద్ అత్యంత ప్రతిభ కనబరచి సిల్వ ర్ మెడల్ సాధించాడని పాఠశాల పీడీ కె.బాలస్వామి తెలిపారు. 400, 600 మీటర్ల పరుగు పందెంలో భానుప్రసాద్ విజయం సాధించాడని, త్వరలో పల్నాడు జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటా డని చెప్పారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యా ర్థి భానుప్రసాద్‌ను గ్రామ సర్పంచ్ నందేటి గంగాభవాని, హెచ్‌ఎం బి.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో ప్రకృతి వ్యవసాయ డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో పెరుమాళ్ల నాగరాజు ఇంటి వద్ద సామూహికంగా బ్రహ్మాస్త్రం తయారీ విధానం, ఉపయోగాలపై గురువారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిటల్ సీఆర్పీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా సేద్యం చేస్తే రైతులకు ఖర్చులు తగ్గడంతో పాటు అధిక దిగుబడులు వస్తాయన్నారు. రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఆర్పీ ఉషారాణి, రైతులు నాగరాజు, కామేశ్వరరావు, పాము వెంకయ్య పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి

ముదినేపల్లిరూరల్: మధ్యాహ్న భోజనానికి సంబంధించి మెనూ సక్రమంగా అమలు చేయాలని ఎంఈవో–1 కె.నరేష్‌కుమార్ ఆదేశించారు. మండలంలోని నరసన్నపాలెం ప్రాథమిక పాఠశాలను గురువారం సందర్శించి, మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ విద్యార్థులకు పోషకాహారాన్ని అందించేందుకు ప్రభుత్వం మెనూలో పొందుపర్చిందన్నారు. దీని ఆధారంగా భోజనాన్ని తయారుచేయాలని సూచించారు. ఉపాధ్యాయుడు ఆర్.శ్రీహరి పాఠశాల ప్రగతిని వివరించారు. మధ్యాహ్న భోజన అమలుపై సంతృప్తి వ్యక్తం చేశారు.

విద్యార్థులకు రక్త నమూనా పరీక్షలు



రక్త నమూనా పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

గుడివాడటౌన్: స్థానిక వీకేఆర్, వీఎన్‌బీ అండ్ ఏజీకే ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు గురువారం రక్త నమూనా పరీక్షలు నిర్వహించామని ప్రిన్సిపాల్ ఎస్‌హెచ్‌వీ ప్రసాదరావు తెలిపారు. కళాశాల ఆడిటోరియంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విజయవాడ ఆంధ్ర హాస్పిటల్ నేతృత్వంలో ఈ పరీక్షలు జరిగాయన్నారు. మొత్తం 450 మంది విద్యార్థులకు పరీక్షలు చేశారన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాదరావు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి రక్త నమూనాలు కళాశాల వద్ద అందుబాటులో ఉంటాయన్నారు. దీని వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని, ప్రమాదవశాత్తు ఎవరికైనా అత్యవసరంగా రక్తం అవసరమైతే వారి నమూనా తెలుసుకోవడానికి, రక్తం అవసరమైన సమయాల్లో ఆ గ్రూప్ వారిని రక్తదానానికి ఆహ్వానించడానికి వీలుంటుందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని రక్త పరీక్షలు నిర్వహించామని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వేములపల్లి కోదండరామయ్య, ఆస్పత్రి టెక్నీషియన్స్ ఎం.సంతోష్, పి.స్వాతి, వెంకట సాయి, నరేష్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజిలెన్స్ అవగాహన ర్యాలీ

మచిలీపట్నంటౌన్: నగరంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం అధికారి కె. వెంకట్రావు ఆధ్వర్యంలో గురువారం నగరంలో విజిలెన్స్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రాంతీయ కార్యాలయం నుంచి కోనేరుసెంటర్ మీదుగా పోర్టు రోడ్డులోని పట్టాభి యూనియన్ బ్యాంక్ వరకు ర్యాలీ జరిగింది. అనంతరం మొక్కలు నాటారు. బ్యాంకు వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య ఇంటి ఆవరణలో, కోనేరుసెంటర్‌లో మానవహారం చేపట్టారు.

సచివాలయాలతో ప్రజలకు మెరుగైన సేవలు

పీఆర్ ఎస్ఈ విజయకుమారి



సచివాలయ భవనాన్ని పరిశీలిస్తున్న ఎస్ఈ విజయకుమారి, సర్పంచ్ ధనలక్ష్మి

పమిడిముక్కల: సచివాలయాల ఏర్పాటుతో ప్రజల ముంగిటకే పౌరసేవలు అందుతున్నాయని కృష్ణా జిల్లా పీఆర్ ఎస్ఈ కె.విజయకుమారి తెలిపారు. జిల్లాలో శరవేగంగా సచివాలయ, ఆర్బీకే, హెల్త్‌సెంటర్ల భవన నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. ఈ నెల 4వ తేదీ నాటికి జిల్లాలో 35 సచివాలయాలు, 20 హెల్త్ సెంటర్లు, 21 ఆర్బీకేల నిర్మాణం పూర్తి చేసి అప్పగించేందుకు చర్య తీసుకొంటున్నామన్నారు. మండంలోని వీరంకి, పమిడిముక్కల, తాడంకి గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న సచివాలయాలు, ఆర్బీకేలు, హెల్త్ సెంటర్ల పనులను గురువారం ఎస్ఈ పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలతో పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మండలంలో జరుగుతున్న పనుల వివరాలను డీఈ శ్రీనివాసరావు, ఏఈ శరాబందిరాజులను అడిగి తెలుసుకొన్నారు.

డిసెంబర్ 25 నాటికి 100 శాతం పూర్తి

ఈ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. పామర్రు నియోజకవర్గంలో 49 సచివాలయాలకు 26 పూర్తి చేశామని, మరో 13 పూర్తి చేస్తామన్నారు. ఆర్బీకేలు 33కు 16 పూర్తి చేశామని, మరో 8 పూర్తి చేస్తున్నామని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. హెల్త్ సెంటర్లు 17కు 6 పూర్తి చేసి ఇచ్చామని, మరో 8 పూర్తి చేసి అప్పగించేందుకు చర్య తీసుకొంటున్నామని, మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది డిసెంబర్ 25వ తేదీ నాటికి అన్ని భవన నిర్మాణాలు పూర్తి చేయాల్సి ఉందని, పనులు చేసిన వెంటనే బిల్లులు చెల్లిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఈ పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, జిల్లా అంతటా పర్యటించి భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని విజయకుమారి చెప్పారు.

పేదల ఆశాజ్యోతి సీఎం వైఎస్ జగన్

మండవల్లి: పేదల ఆశాజ్యోతి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్(రాము) అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎంపీపీ రాము అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు సమన్యాయం చేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ప్రజలకు నవరత్నాలతో అన్ని సమస్యలకు చెక్ పెట్టినట్లయిందన్నారు. ఇటీవల ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజల చెంతకే అధికారులు వచ్చి వారికి కావలసిన సర్టిఫికెట్‌లతో సహా ఎలాంటి సమస్యలున్నా అధికారులు పరిష్కరించే విధంగా ప్రవేశపెట్టిన ఈ పథకం దేశంలో ఏరాష్ట్రంలో లేదని పేర్కొన్నారు.

ఈ పథకం ద్వారా ప్రజల ఆరోగ్య సమస్యలు పరిష్కరింపబడటమే కాకుండా, వారి ఆర్థిక సమస్యలు కూడా నివారించబడుతున్నాయన్నారు. జెడ్పీటీసీ సభ్యులు ముంగర విజయనిర్మల, వైస్ ఎంపీపీ అగస్తీ ఆదివిష్ణు, ఎంపీడీవో సీకే వెంకటరమణ, తహసీల్దార్ కె.రాజ్‌కుమార్, సర్పంచ్ మెండా ఝాన్సీ, కానుకొల్లు పశుసంవర్థక శాఖ డాక్టర్, సీడీపీవో ఆనంద్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.